# అక్షర సత్యం

ఆ గర్భశ్రీమంతుడు, ఆదర్శభావాలుగల వ్యక్తి ఆప్తుడయినందుకు నేనెంతో గర్వపడ్డాను. అయితే అతడి ఆదర్శాలు వల్లె వేయడానికే తప్ప ఆచరణకు నోచుకోలేదని తెలిసి నా వళ్ళు మండిపోయింది. కోపం అణచుకోలేక వాడిని మాటలతో కడిగేసి వచ్చాను. ఇప్పుడు వాడి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం చూశాక నేనెందుకంత తొందరపడ్డానా అనిపిస్తోంది.


సన్నిహిత్, నేను కలిసి చదువుకున్నాం. కలిసిమెలిసి తిరిగాం. వాడు మెడిసన్ చదివి డాక్టరైతే నేను అప్లైడ్ ఫిజిక్స్‌లో పోస్టుగ్రాడ్యుయేషన్ చేసి లెక్చరర్‌నయ్యాను. ఎదుటివాడి మీదనింద మోపేముందు అన్ని కోణాలలోంచి ఆ వ్యక్తిని చదవవలసి ఉంటుందన్న నగ్న సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. వెంటనే వెళ్ళి వాడికి క్షమాపణలు చెబితే తప్ప తీరదీ ఆవేదన.. ఇలా అనుకుంటూ ఉండగానే గతించిన సంఘటన మళ్ళీ కళ్ళ ముందు మెదిలింది.

ఎక్కడో సుదూర ప్రాంతంలో ఉంటున్న మా తోడల్లుడు తాతారావు, మరదలు మాణిక్యం ఓరోజు అనూహ్యంగా ఊడిపడ్డారు. చెల్లెల్ని చూసిన మా శ్రీమతి ఆనందానికి అంచుల్లేవు. వచ్చిన వాళ్ళని ఆప్యాయంగా పలకరించింది. వాళ్లు ఉన్నన్నాళ్ళూ వాళ్ళకిష్టమైన పిండివంటలు చేసి పెట్టింది. సహజంగా తాతారావు కూడా కలుపుగోరు మనిషి కావడంతో మేమిద్దరం ఇట్టే కలిసిపోయాం. తిరిగివెళ్ళే ముందు వాళ్ళు కృతజ్ఞతగా మమ్మల్ని కూడా వాళ్ళ ఊరు రమ్మన్నారు. అలాగేనని చెప్పి వాళ్ళ ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తుండగా మాణిక్యం తలపట్టుకుని గిలగిలలాడిపోతూ క్రింద పడిపోయింది. ఆమె పరిస్థితికి నేనూ మా ఆవిడ తెగ కంగారుపడిపోయాం.

తాతారావు గబగబా బ్యాగులో నుంచి మాత్ర తీసి భార్యచేత మింగించాడు.

నాకేం చేయాలో తోచక డాక్టరుకు ఫోన్ చేద్దామని రిసీవరు అందుకున్నాను.

"మాణిక్యానికి తరచు ఇలాగే తలనొప్పి వస్తుంటుందా" అడిగాను ఉండలేక.



"ఎప్పుడొస్తుందో చెప్పలేం. అందుకే టాబ్లెట్స్ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుకుంటాను. మరీ సివియర్ అయితే ఇంజక్షన్ కూడా నేనే చేస్తాను"

"మంచి డాక్టరికి ఎవరికైనా చూపించలేకపోయారా?"

"ఎంతోమందికి చూపించాను. అయినా ఆశించిన గుణం కనిపించడం లేదు"

"అది సరే, డాక్టర్ సన్నిహిత్ పేరు మీరెప్పుడైనా విన్నారా?"

నా ప్రశ్నకు తెలీదన్నట్లు ముఖం పెట్టాడు తాతారావు.

"వాడు నాక్లాస్‌మేట్. మంచి ఫిజీషియన్. ఇలాంటి జబ్బుల్ని వాడు ఇట్టే నయం చేయగలడు. ఎడ్రస్ ఇస్తాను. రేపే వెళ్ళి వాడిని కలవండి. వృత్తిని సేవకోసం నమ్ముకున్న వ్యక్తి. కన్సల్టేషన్ ఫీజు కూడా పుచ్చుకోడు. చక్కగా పరీక్షచేసి అమోఘమైన మందిస్తాడు"

నామాట మీద వాడికి గురి కుదరినట్లుంది. మరునాడే పార్వతీపురం ప్రయాణం కట్టాడు.

ఊరెళ్ళి పదిహేనురోజులైనా వాళ్ళ దగ్గరనుంచి సమాచారమేదీ లేకపోవడంతో ఫోన్లో మాణిక్యం ఆరోగ్య పరిస్థితి గురించి వాకబ్‌చేశాను.

"ప్రస్తుతం బాగానే ఉంది. డాక్టరు రాసిచ్చిన మందులు వాడుతున్నాం. అది అలావుంచి ఇక్కడ మీకో విషయం చెప్పాలి. అతడు మీరనుకున్నంత ఆదర్శవంతుడేం కాదు. ముప్పై రూపాయలు ఫీజు చెల్లించి రెండు గంటలసేపు పడిగాపులు పడితే తప్ప అతడి దర్శనమే కాలేదు ఫీజు ఇవ్వవలసి వచ్చినందుకు బాధపడటం లేదు. ఎంతోమంది డాక్టర్లకి ఇంతకంటే చాలాఎక్కువ ఫీజులే చెల్లించాను. కాకపోతే మీరతడి మీద పెంచుకున్న నమ్మకాన్ని చూస్తేనే నాకెంతో జాలేస్తోంది."

తాతారావు మాటలు విన్న తర్వాత వాడి మీద నాకు పీకలవరకు కోపం వచ్చింది. ఎవరి దగ్గరాడబ్బులు తీసుకోనని ప్రగల్భాలు పలికిన నా మిత్రుడేనా వీడు?

అసలు వాడికేం తక్కువ? పదితరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి ఉంది. నా పిచ్చిగాని చిన్ననాటి ఆశయాలు, ఆదర్శాలు కడదాకా ఉంటాయా? డబ్బు ఎవరికి చేదు? ఎంతున్నా ఇంకా కూడబెట్టాలనుకోవడం మానవనైజం. దానికి వాడు అతీతుడవుతాడనుకోవడం నా బుద్ధిపొరపాటు. అనవసరంగా తాతారావు దగ్గర స్నేహితుడి గురించి బీరాలు పలికి భంగపడ్డాను. వెంటనే వాడి వద్దకెళ్ళి నాలుగు మాటలు దులిపేస్తే తప్పనా మనసు స్థిమిత పడేటట్లు లేదు. అనుకోవడమే తడవుగా ఆచరణలో పెట్టాను వాడు చెప్పేదేమిటో కూడా వినిపించుకోకుండా. అయితే ఇప్పుడు వాడి దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం నా కళ్ళు తెరిపించింది. వాడి చర్య నాకిప్పుడు న్యాయబద్ధంగానే ఉందనిపిస్తోంది. అలా అనుకుంటూనే మరోసారి ఉత్తరంలోకి దృష్టిసారించాను.

.....

"రెండవుతోంది. భోజనానికి లేవండి. తతిమావాళ్ళను తర్వాత చూద్దురుగాని" అసహనంగా పలికింది అలేఖ్య.

అది ఆమె ఆరో పిలుపు.

"అవతల బోలెడంతమంది పేషంట్లు ఉండిపోయారు. మరోనలుగుర్ని చూసి వచ్చేస్తాను"

ఎప్పటిలాగే సన్నిహిత్ సమాధానం.

నిట్టూర్చింది అలేఖ్య. మగడి చెంతనతప్ప ఆమెకు ఒంటరిగా కంచంముందు కూర్చునే అలవాటు లేదు.

"నమస్కారం డాక్టరుగారు" చేతులు జోడిస్తూ లోపలకొచ్చాడో రోగి.

"కూర్చో ఏవిటి నీ బాధ?" అడిగాడు సన్నిహిత్ మెడలోని స్టెతస్కోప్ తీస్తూ.

"బాధంటే బాధేం లేదు"

"మరి"

"ఒంట్లో కాస్త నీర్సంగా ఉంటోంది"

"శుభ్రంగా తినవయ్యా ఈ మాత్రానికి నా దగ్గరకు పరుగెత్తుకు రావాలా" అన్నాడు డాక్టర్ సన్నిహిత్ ఓ టానిక్ బాటిల్ అతగాడి చేతిలో పెడుతూ.

మందు సీసా పుచ్చుకుని పరమానందభరితుడై వెళ్ళిపోయాడు వచ్చిన ఆసామి.

"చెప్పు నీకేమైంది. జ్వరమా? జలుబా?" అడిగాడు అప్పుడే లోపల కొస్తున్న మరోపేషంటు నుద్దేశించి. అప్పటికే ఎంతోమంది రోగుల్ని చూడటం వల్ల అతడిలో సహనం నశిస్తోంది.

నాకు జ్వరం గిరం లాంటివేవీలేవు బాబు. రాత్రి పది దాటితే కానీ నిద్రపట్టడం లేదు. అదీ నాబాధ. త్వరగా నిద్ర రావడానికేదైనా..'' నసిగాడు వచ్చిన దృఢకాయుడు.

కాస్త శరీరానికి పని కల్పించు. నిద్ర దానంతటదే వస్తుందీ.

"అంటే''

"రోజూ ఓ మైలు దూరం నడు'' అతగాడికి బోధపడేటట్లు చెప్పాడు సన్నిహిత్..

ఇదీ నాక్లినిక్ భాగోతం. రోజూ కొన్ని వందల మంది వస్తూంటారు. నేను ఫీజు తీసుకోనని వాళ్ళకు తెలుసు. అందుకే ఎందుకైనా మంచిదని రోగం ఉన్నాలేకున్నా ఓమారొచ్చి పరీక్ష చేయించుకుని వెళుతూ ఉంటారు. ఇటువంటి వాళ్ళ వల్ల నిజంగా జబ్బుతో బాధపడేవాళ్ళు కూడా ఎంతో సేపు వేచి ఉండవలసివస్తోంది. పోనీ జబ్బు తాలూక సీరియస్‌ని బట్టి ముందూ వెనకా చూద్దామన్నా ఒప్పుకోరు వీళ్ళు. ముందు వచ్చిన వాళ్ళని ముందుగా చూడాలని భీష్మించుకు కూర్చుంటారు. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలో తెలీడం లేదు.

"ఎంతోకొంత కన్సల్‌టేషన్ ఫీజు పెట్టండి. అప్పుడు వైద్యం అవసరం ఉన్నవాళ్ళు మాత్రమే వస్తారు. మీకూ శ్రమ తగ్గుతుంది. వచ్చిన వాళ్ళులబ్ధిపొందుతారు'' అంటూ గీతోపదేశం చేసింది మా శ్రీమతి.

ఆమె సలహా నా ఆశయానికి గండికొట్టేదిగా ఉన్నా ఆచరించక తప్పలేదు.

.....

నిజమే నాకు చెప్పింది అక్షరసత్యం.

ఫ్రీగా వస్తే ఫినాయిలైనా తాగేయడానికి సిద్ధపడే మనుషులున్నంత కాలం ఆశయాలున్నా వాటికి సంపూర్ణన్యాయం చేయడం అసంభవమనిపించింది.

( 24,జూలై,2003 ఆంధ్రభూమి వీక్లీ )